ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



కృష్ణా జిల్లా వార్తలు

సోమవారం 19 ఫిబ్రవరి 2024



రాబోయే పాతికేళ్లలో మహాశక్తిగా భారత్

ఎస్ఆర్‌జీఈసీ రజతోత్సవ ముగింపు కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

- 6లో..



రసాభాసగా..

పట్టాభి స్మారక భవన అనుమతులపై అఖిలపక్ష సమావేశం

- పట్టాభి భవన కమిటీ కరపత్రాలు చించేసిన వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న
- వాగ్వాదాల మధ్య ముగిసిన సమావేశం

- 6లో..



ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరాలయ పునఃప్రారంభం

- శాస్త్రోక్తంగా స్వర్ణశిఖరానికి కుంభాభిషేకం
- వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

- 6లో..



పాత సామాన్లలో

నకిలీ పొగ

పార్శిల్ చేసేది.. తీసుకునేది ఒకరే

- నకిలీ సిగరెట్ల విక్రయాలకు అడ్డాగా రాజధాని జిల్లాలు
- ఒక్కో బ్రాండ్‌తో అమ్మకాలు
- విజయవాడ, గుంటూరులో గోడౌన్లు
- ఢిల్లీ, బంగ్లాదేశ్‌లో తయారీ
- చిరునామాలు లేకుండా పార్శిళ్లు



హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాస్ కొద్దిరోజుల క్రితం ఒక పార్శిల్ చేశాడు. మచిలీపట్నానికి చెందిన శ్రీనివాస్‌కు ఈ పార్శిల్ వచ్చింది. ఈ రెండింటిలో నగరాల పేర్లు మాత్రమే వేర్వేరుగా ఉన్నాయి. పార్శిల్ చేసిన వ్యక్తి, తీసుకునే వ్యక్తుల పేర్లు ఒక్కటే. పేర్లు ఒకటే అయినా వ్యక్తులు మాత్రం వేర్వేరు అనుకుంటున్నారా? అలా అనుకుంటే పొరబడినట్టే. హైదరాబాద్ నుంచి పార్శిల్ చేసిన వ్యక్తి, మచిలీపట్నంలో తీసుకునే వ్యక్తి ఒకరే. నకిలీ సిగరెట్ల పార్శిల్‌లో మాఫియా వ్యవహరిస్తున్న పంథా ఇది.

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : సాధారణంగా ఒక వస్తువును మరోచోటకు పార్శిల్ చేసినప్పుడు చేసిన వ్యక్తి పేరు, చిరునామా, ఫోన్ నంబరు దానిపై ఉంటాయి. పార్శిల్ తీసుకునే వ్యక్తి పేరు, చిరునామా, ఫోన్ నంబర్ ఉంటాయి. ఈ వివరాలతో పనిలేకుండా పేరు, ప్రాంతం పేరు రాసి పార్శిల్ చేస్తున్నారు. తాజాగా విజిలెన్స్ అధికారులు రూ.19.20 లక్షల నకిలీ సిగరెట్లను విజయవాడ ఆటోనగర్‌లోని క్రాంతి పార్శిల్ సర్వీస్ సంస్థలో సీజ్ చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో కూపీ లాగుతుంటే కొత్తకొత్త విషయాలు బయటపడుతున్నాయి. నకిలీ సిగరెట్ల వ్యాపారాన్ని సాగిస్తున్న మాఫియా ట్రిక్‌లు వెలుగులోకి వస్తున్నాయి. రాజధాని జిల్లాలు నకిలీ సిగరెట్ల విక్రయాలకు అడ్డాగా మారుతున్నాయని బ్రాండెడ్ కంపెనీలు గగ్గోలు పెడుతున్నాయి. తమ బ్రాండ్లను పోలినట్టుగా నకిలీ బ్రాండ్లతో సిగరెట్లను మార్కెట్‌లోకి దింపి అసలు బ్రాండ్ల వ్యాపారాన్ని కొల్లగొడుతున్నారని గోల పెడుతున్నాయి.

పాత సామాన్ల ముసుగులో...

నకిలీ సిగరెట్ల వ్యాపారంలో కోట్లకు పడగలెత్తిన మాఫియా నిఘా వర్గాల నుంచి తప్పించుకోవడానికి రకరకాల ఎత్తులు వేస్తోంది. హైదరాబాద్, ఇతర నగరాల నుంచి భారీగా నకిలీ సిగరెట్లను కొనుగోలు చేస్తున్నారు. వాటిని విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం నగరాలకు తరలించడానికి పాత సామాన్లను ఎంచుకుంటున్నారు. సిగరెట్ల పెట్టెలు ప్యాక్ చేసిన అట్టపెట్టెలను గోనె సంచుల్లో పెట్టి పార్శిల్ చేస్తున్నారు. పార్శిల్ కార్యాలయాల వద్ద సరుకు ఏమిటని ఆరా తీస్తుంటే పాత ఇంటి సామాన్లు అని చెబుతున్నారు. సరుకును కొనుగోలు చేసిన వ్యక్తులే ఆయా నగరాల నుంచి పార్శిల్ చేస్తున్నారు. విజయవాడ, గుంటూరు నగరాల్లో ఉన్న పార్శిల్ కార్యాలయాలకు తమ పేరు మీదే పార్శిల్ చేస్తున్నారు. పార్శిల్ చేసేటప్పుడు పేరు, ఊరు వివరాలు మాత్రమే ఇస్తున్నారు. కొద్దిరోజుల క్రితం విజయవాడ ఆటోనగర్‌లో క్రాంతి పార్శిల్ సర్వీసు కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు పాత ఇంటి సామాన్లు అని రాసి ఉన్న పార్శిల్‌ను తెరచి చూడగా, అందులో నకిలీ సిగరెట్లు ఉన్నట్టు గుర్తించారు. మచిలీపట్నంలో ఒకరు, గుంటూరు జిల్లా తెనాలిలో ఇద్దరు ఈ పార్శిళ్లను తీసుకోవాల్సి ఉంది. వారి పేర్ల మీదే పార్శిళ్లు ఇక్కడికి వచ్చాయి. అసలు వాటిని ఎవరు పంపారు అని పరిశీలించగా హైదరాబాద్ నుంచి ఈ ముగ్గురూ ఈ పార్శిల్ చేసినట్టు తేలింది.

ప్రత్యేక గోడౌన్లు

ఢిల్లీ, ఓడల రేవుల నుంచి కంటైనర్ల ద్వారా వచ్చిన నకిలీ సిగరెట్లను భద్రపరచడానికి విజయవాడ, గుంటూరులో ప్రత్యేకంగా గోడౌన్లు ఉన్నాయి. విజయవాడలో భవానీపురం, గొల్లపూడి ప్రాంతాల్లో కొన్ని గోడౌన్లలో ఈ నకిలీ సిగరెట్లు ఉంటున్నాయి. గుంటూరు, చిలకలూరిపేట జాతీయ రహదారికి పక్కన ఈ గోడౌన్లను వ్యాపారులు అద్దెకు తీసుకున్నారు. ఢిల్లీతోపాటు మరికొన్ని ప్రాంతాల నుంచి రాత్రిపూట ఈ కంటైనర్లు బయలుదేరి విజయవాడ, గుంటూరుకు చేరుకుంటున్నాయి. గోడౌన్లలో అన్‌లోడ్ అయిన సరుకును అక్కడే ఉంచకుండా భాగాలుగా విడదీసి వేర్వేరుచోట్ల భద్రపరుస్తున్నారు. నకిలీ సిగరెట్ల సరఫరాకు విజయవాడ, గుంటూరు వాణిజ్య కేంద్రాలుగా పనిచేస్తున్నాయి. ఇదే విషయాన్ని కస్టమ్స్ ప్రివెంటివ్ విభాగాధికారులు గుర్తించారు. ప్రతినెలా కోట్లాది రూపాయల విలువ చేసే సరుకు విజయవాడ, గుంటూరులో అన్‌లోడ్ అవుతున్నట్టు సమాచారం. కస్టమ్స్ అధికారులు ఇప్పటి వరకు 16 మిలియన్ల నకిలీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారంటే వ్యాపారం ఎంత జోరుగా సాగుతుందో అర్థమవుతోంది.

బందరులో భూ తంత్రం



అసైన్డ్ భూముల రికార్డులు లేకుండానే పట్టాలు ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి

- ఎన్నికల నేపథ్యంలో బందరు వైసీపీ నేతల కుతంత్రం
- ఉన్నతాధికారుల సూచనలతో పనిచేస్తామని చెబుతున్న రెవెన్యూ అధికారులు

బందరు మండలంలో అసైన్డ్ భూములకు పట్టాల అంశం వివాదాలకు కేంద్రమవుతోంది. ఏ ప్రాతిపదికన పట్టాలు మంజూరు చేయాలనే అంశంపై స్పష్టత రావడం లేదు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో అసైన్డ్ భూములకు పట్టాలివ్వాలని అధికార పార్టీ నాయకులు హుకుం జారీ చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదుర్కొంటామని రెవెన్యూ అధికారులు, సిబ్బంది బెంబేలెత్తిపోతున్నారు. బందరు మండలంలోని 12వేల ఎకరాలకుపైగా అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వాల్సిందేనని రెవెన్యూ అధికారులపై వైసీపీ పెద్దలు ఒత్తిడి కత్తి పెట్టడంతో ఈ పరిణామం తమ మెడకు చుట్టుకుంటుందని రెవెన్యూ ఉద్యోగులు హడలిపోతున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : బందరు మండలంలో 11 రెవెన్యూ గ్రామాల్లో 12వేల ఎకరాలకు పైగా అసైన్డ్‌భూమి ఉన్నట్టు ఇటీవల రెవెన్యూ అధికారులు లెక్కలు తేల్చారు. ఈ భూమిలో 9వేల ఎకరాలకుపైగా భూమి అనర్హుల స్వాధీనంలో ఉన్నట్టు నిర్ధారించారు. ఇలాంటి స్థితిలో అసైన్డ్ భూములకు సంబంధించి ఎవరి పేరున పట్టాలు మంజూరు చేస్తారని అనేక అనుమానాలున్నాయి. ఇటీవల కాలం వరకు పనిచేసి బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌తో అసైన్డ్ భూములకు సంబంధించిన నోటీసులపై సంతకాలు చేయించారు. కొన్ని మిగిలిపోయాయి. ఎన్నికల నియమావళి ప్రకారం ఇటీవల నూతనంగా వచ్చిన ఇద్దరు తహసీల్దార్లు ఈ నోటీసులపై తాము సంతకాలు చేసేది లేదని, ఎన్నికల విధుల వరకు చూసుకుంటామని చెప్పకనే చెబుతున్నారు. దీంతో అధికార పార్టీ నాయకులు కొత్త ఎత్తుగడకు శ్రీకారం చుట్టారు. నూతన తహసీల్దార్లతో పనిలేకుండా పాత తహసీల్దార్‌తోనే మిగిలిన నోటీసులపై సంతకాలు చేయించే పనిని నేటికీ కొనసాగిస్తున్నారు. అసైన్డ్ భూములకు సంబంధించి రికార్డులు సక్రమంగా లేకున్నా ప్రస్తుతం సాగు చేసుకుంటున్న వారి పేరున పట్టాలు ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. గతంలో ప్రభుత్వ పేదలు సాగు చేసుకునేందుకు పట్టాలు ఇచ్చినట్టు ఏమైనా ఆధారాలుంటే ప్రస్తుతం పట్టాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుందని, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని, ఎలాంటి పత్రాలూ లేకుండా ఇప్పుడు సాగులో ఉన్న వారిపేరున పట్టాలు మంజూరు చేస్తే ఇబ్బంది పడతామని రెవెన్యూ ఉద్యోగులు అంటున్నారు. జిల్లాలోని పలు మండలాల్లో అసైన్డ్ భూములు ఉండగా బందరు మండలంలోనే అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు చేయాలని తమపై ఒత్తిడి పెడుతున్నారని ఉద్యోగులు అంటున్నారు.

అధికారులతో 'పెద్దల' సమావేశం

బందరు తహసీల్దార్ కార్యాలయంలో శనివారం రాత్రి వైసీపీ పెద్దలు రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్లు, డివిజన్ స్థాయి అధికారిని ఈ సమావేశానికి పిలిపించి అసైన్డ్ భూములకు నోటీసులు జారీచేసి, అనంతరం పట్టాలు ఇవ్వాల్సిందేనని వారు పట్టు పట్టాబట్టారు. అసైన్డ్ భూములకు రికార్డులు సక్రమంగా ఉండవని, ఇప్పటికిప్పుడు ఈ అంశం తేలదని, రెవెన్యూ అధికారులు చెప్పారు.

తాము చెప్పిన పనులు ఎందుకు చేయరని, చేయాల్సిందేనని వైసీపీ పెద్దలు పట్టుబట్టడంతో అధికారులు చేసేది లేక జాయింట్ కలెక్టర్‌కు సమస్యను వివరించి తదుపరి చర్యలు చేపతామని చెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయినట్టు రెవెన్యూ ఉద్యోగులు తెలిపారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే బదిలీపై వెళ్లిన తహసీల్దార్‌తో కొన్ని నోటీసులపై సంతకాలు చేయించినట్టు విశ్వసనీయ సమాచారం.

వీఆర్వోలతో సమావేశం

శనివారం అర్ధరాత్రి వరకు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో జేసీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం రెవెన్యూ అధికారులు, వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరుచేసే అంశంలో ఉన్న ఇబ్బందులు, భవిష్యత్‌లో ఎదుర్కోవాల్సిన ఇక్కట్లను రెవెన్యూ అధికారులు సిబ్బంది వివరించారు. వారు చెప్పిన అంశాలను పరిగణనలోకి తీసుకున్న జేసీ, కలెక్టర్ దృష్టికి ఈ అంశాలను తీసుకువెళదామని చెప్పినట్టు సమాచారం. జేసీతో సమావేశం ముగిసిన అనంతరం ఆదివారం సాయంత్రం కలెక్టర్‌తో సమావేశం ఉంటుందని, అందరూ తహసీల్దార్ కార్యాలయం వద్దనే అందుబాటులో ఉండాలని చెప్పారు. ఆదివారం రాత్రి కలెక్టర్ అందుబాటులో లేని కారణంతో ఈ సమావేశం వాయిదా వేశామని, సోమవారం ఉదయం ఏడు గంటలకు ఎమ్మెల్యే పేర్ని నానితో సమావేశం ఉంటుందని తప్పకుండా హాజరుకావాలని రెవెన్యూ అధికారులు చెప్పారు.

తప్పుడు పత్రాలు చూపి రుణాలు

బందరు మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ, అసైన్డ్‌భూమి బడాబాబుల చేతుల్లో ఉంది. వారు తప్పుడు భూ రికార్డులు సృష్టించి, తమ బంధువులు, ఇతరుల పేరున భూమి ఉన్నట్టు చూపి 2012లో వందల కోట్ల రూపాయలను బ్యాంకుల్లో రుణాలుగా తీసుకున్నారు. కోన, రుద్రవరం, గుండుపాలెం, బందరుకోట రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ తరహా అంశాలు వెలుగులోకి రావడంతో వివాదాస్పదమైంది. తప్పుడు ధ్రువపత్రాలతో బడాబాబులు వివిధ బ్యాంకుల్లో కోట్లాది రూపాయలు రుణాలు పొందడంపై సీబీఐ విచారణకు ఆదేశించారు. ఈ విచారణ 2012 నుంచి నేటికీ కొనసాగుతోంది. ఏడాది క్రితం బందరు మండలంలోని బందరు వెస్ట్ రెవెన్యూ గ్రామ పరిధిలోని అసలు భూ యజమానులకు తెలియకుండా భీమవరానికి చెందిన బడాబాబులు బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న అంశం వెలుగులోకి వచ్చింది. దీంతో అసలు భూ యజమానులు పోలీసులకు, బ్యాంకు అధికారులకు ఫిర్యాదులు చేయడంతో ఈ అంశంపై విచారణ జరుగుతోంది. ఇలాంటి స్థితిలో బందరు మండలంలో అసైన్డ్ భూములకు పట్టాలు మంజూరు చేస్తామని అధికార పార్టీ నాయకులు చెప్పడం దీని వెనుక ఉన్న అంతరార్థం ఏమిటనే అంశంపై చర్చ జరుగుతోంది.

ఓటి బోట్లు..!



పర్యాటకుల ప్రాణాలతో ఏపీటీడీసీ చెలగాటం

- జలవిహారంలో అనుమతుల్లేని బోట్లు
- నిబంధనలకు విరుద్ధంగా అనేక బోట్లు నడుపుతున్న పర్యాటకాభివృద్ధి సంస్థ

కృష్ణానదిలో జలవిహారంలో పర్యాటకుల ప్రాణాలకు భద్రత లేకుండా పోతోంది. ప్రైవేటు బోట్లకు సవాలక్ష నిబంధనలు చెప్పే ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులు తమ బోట్లకు మాత్రం నిబంధనలు పాటించడం లేదు. కృష్ణానదిలో తిరగాడే పర్యాటక బోట్లలో చాలా వరకు మారిటైమ్ బోర్డు అనుమతులు లేవు. ఇరిగేషన్ అనుమతులు కూడా లేవు. బోట్ల ఇన్సూరెన్స్ గడువు కూడా ముగిసిపోయింది. గోదావరి నదిలో జరిగిన బోటు ప్రమాదం తర్వాత.. పర్యాటకాభివృద్ధి సంస్థ అనుమతుల కోసం నిబంధనలను తీసుకొచ్చినా అవి కాగితాలకే పరిమితమయ్యాయి. ఈ నిబంధనలను తుంగలో తొక్కి అడ్డగోలుగా తిప్పుతోంది కూడా ఏపీటీడీసీనే కావటం గమనార్హం.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణానదిలో జల విహారానికి సంబంధించి ఏపీటీడీసీకి చెందిన ధరణి పాంటూన్ (10 + 2 సీటింగ్), పోలిక్రాఫ్ట్ (2+1), జలజాక్షి (10+2), ఆమరపాలి (32+4), జగదాంబ (18+4), క్రిష్ణవేణి (29+4), భవాని (31+4), బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్ (96+4) బోట్లు ఉన్నాయి. పోర్టు ఎన్‌ఓసీలు ఉంటే తప్ప వీటిని నడపకూడదు. మారిటైమ్ బోర్డు నుంచి నిరభ్యంతర పత్రాలు రావాలంటే.. అనేక అంశాలను చూస్తారు. బోట్లను తయారు చేసిన కంపెనీ, బోట్ల దుర్భేద్యత, బోట్ల నాణ్యత, నీటి ఉధృతిని తట్టుకునేలా ఉండటం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని తనిఖీలు చేసిన తర్వాతే.. వాటికి పోర్టు ఎన్‌వోసీలు వస్తాయి. ఎన్‌వోసీలు వచ్చిన తర్వాత ఇరిగేషన్ శాఖ నుంచి అనుమతులు తీసుకోవాలి. పైన చెప్పుకున్న బోట్లలో చాలా వాటికి పోర్టు అనుమతులు కానీ, ఇరిగేషన్ అనుమతులు కానీ లేవు.

బోట్ల పరిస్థితిలా..

ధరణి పాంటూన్ బోటుకు 2023 ఫిబ్రవరి 14 నాటికి పోర్టు ఎన్‌వోసీ గడువు ముగిసింది. మళ్లీ ఈ బోటుకు మారిటైమ్ బోర్డు ద్వారా పరీక్షలు నిర్వహించి ఎన్‌వోసీ తెచ్చుకున్నాకే కృష్ణానదిలో నడపాల్సి ఉండగా.. ఎలాంటి అనుమతులూ లేకుండానే బోటును నడిపేస్తున్నారు.

- పోలిక్రాఫ్ట్ బోటుకు సంబంధించి చూస్తే.. దీనికి కూడా పోర్టు ఎన్‌వోసీ, ఇరిగేషన్ అనుమతులు లేవు. 2023 ఫిబ్రవరి 14 నాటికి దీనికి ఉన్న ఎన్‌వోసీ గడువు కూడా అయిపోయింది.
- జగదాంబ బోటుకు అక్టోబరు 2024 వరకే ఎన్‌వోసీ గడువు ఉంది. ఇప్పటి వరకు దీని ఎన్‌వోసీ రెన్యువల్ చేయలేదు.
- ఇక ప్రధానమైన బోట్ల విషయానికి వస్తే క్రిష్ణవేణి ఉంది. ఈ బోటుకు సంబంధించి జనవరి 19, 2024తో పోర్టు ఎన్‌వోసీ అనుమతి ముగిసిపోయింది. దీనికి ఎలాంటి ఇరిగేషన్ అనుమతీ లేదు. ఈ బోటుకు రూట్ పర్మిషన్ కూడా జనవరి 19, 2024 నాటికి ముగిసిపోయింది.
- మరో ప్రధానమైన మెకనైజ్డ్ బోటు భవాని. ఈ బోటుకు కూడా జనవరి 19 నాటికి పోర్టు అనుమతి అయిపోయింది. ఇరిగేషన్ అనుమతి కూడా లేదు. ఈ బోటుకు రూట్ పర్మిషన్ జనవరి 19కి అయిపోయినా నడుపుతున్నారు.
- అత్యంత ప్రధానమైన బోధిసిరి డబుల్ డెక్కర్ క్రూయిజర్ బోటుకు కూడా ఏప్రిల్ 3, 2024 వరకే అనుమతి ఉంది. బోధిసిరికి ఇప్పటి వరకు ఇరిగేషన్ అనుమతి కూడా లేదు. ఇరిగేషన్‌శాఖ నుంచి కూడా అనుమతులు, క్లియరెన్సు తీసుకోకుండానే బోట్లను నడిపేస్తున్నారు.

అప్పటి హడావిడి ఇప్పుడేది?

గోదావరి నదిలో బోటు మునిగిపోయినపుడు రాష్ట్ర వ్యాప్తంగా ఏడాది పాటు బోటింగ్ కలాపాలు నిలిపివేశారు. కృష్ణానదిలో కూడా నిలుపుదల చేశారు. పోర్టు ఎన్‌వోసీలు, ఇరిగేషన్ అనుమతులు, పర్యాటకుల సేఫ్టీ అరేంజ్‌మెంట్స్, కంట్రోల్‌రూమ్‌లు వంటివి ఏర్పాటు చేశాక మాత్రమే అనుమతులు ఇచ్చారు. ఇప్పుడు అలాంటివేమీ లేకపోయినా.. బోట్లను నడిపేస్తున్నారు.

నిప్పును ఆర్పే పరికరాలకు తీరిన గడువు

బోట్లలో ప్రమాదవశాత్తూ ఏదైనా ఫైర్ సంభవించినా.. తగలబడిపోతున్నా.. ముందుగా రక్షించేది ఫైర్ ఎగ్జింట్వింగిషర్స్ (నిప్పును ఆర్పే పరికరాలు). ఆఖరికి ఇవి కూడా గడువు దాటి పోయాయి. మొత్తం 34 ఫైర్ ఎగ్జింట్వింగిషర్స్ ఉండగా.. అన్నీ జనవరి 11, 2024 నాటికి గడువు దాటి పోయాయి. ఇవి పనిచేయకపోతే పర్యాటకుల ప్రాణాలకే ప్రమాదం సంభవిస్తుంది.

చిన్నారిని చిదిమేసిన లారీ

తల్లి కళ్లెదుటే కుమార్తె మృతి



పూనం చౌదరి (ఫైల్)

గుణదల, ఫిబ్రవరి 18 : లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఒక చిన్నారిని చిదిమేసింది. కళ్ల ఎదుటే బిడ్డ లారీ చక్రాల కింద ఛిద్రమై ప్రాణాలు వదలడం చూసిన తల్లి దిక్కులు పిక్కటిల్లేలా రోదించింది. ఈ దారుణం రామవరప్పాడు రింగ్ సెంటర్లోని నోవాటెల్ హోటల్ వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రసాదంపాడు కోళ్లఫారం రోడ్డులో నివాసం ఉంటున్న నలజల నాగబాబు, రాధిక దంపతులకు ఇద్దరు సంతానం. దంపతులు ఇరువురు ప్రైవేటు టీచర్లుగా పనిచేసి జీవనం సాగిస్తున్నారు. కుమారుడు డిగ్రీ పూర్తిచేయగా, కుమార్తె పూనం చౌదరి (12) గుణదలలోని సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో 7వ తరగతి చదువుతోంది. ఆదివారం సెలవు కావడంతో తల్లితో కలిసి పంటకాల్వ రోడ్డులోని చర్చికి ఇంటి నుంచి రాధిక కుమార్తెను తీసుకుని స్కూటీపై బయలుదేరారు. వీరు ఇరువురు నోవాటెల్ వద్ద జాతీయ రహదారి వద్దకు చేరుకోగానే వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ వీరిని ఢీకొట్టడంతో తల్లి రాధిక కుడివైపుకు పడిపోయారు. పూనం ఎడమవైపునకు పడటంతో లారీ ముందు చక్రాలు పూనం పై నుంచి వెళ్లాయి. ప్రమాదంలో బాలిక అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. స్వల్పగాయాలతో బయటపడ్డ రాధిక కళ్లెదుటే కుమార్తె పూనం విగతజీవిగా పడి ఉండటంతో గుండెలవిసేలా రోదిస్తున్న తల్లిని చూసి ప్రతి ఒక్కరూ కలతచెందారు. సమాచారం అందుకున్న పటమట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పటమట సీఐ మోహన్‌రెడ్డి తెలిపారు.

వీరమ్మ తిరునాళ్లకు ఏర్పాట్లు పూర్తి

ఉయ్యూరు, ఫిబ్రవరి 18 : వీరమ్మ తిరునాళ్లకు అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. సోమవారం రాత్రి మెట్టినింటి నుంచి గండదీపాలతో బయలు దేరే అమ్మవారు ఆచారం ప్రకారం ఉయ్యూరు పట్టణ పోలీసుల పసుపుకుంకుమ, చీర సారె అందుకున్న తరువాత పల్లకిలో ఊరంతా ఊరేగుతారు. అమ్మవారికి పసుపు కుంకుమ అందించేందుకు పట్టణ ఎస్సై గణేశ్‌కుమార్ ముందుగా స్టేషన్‌లో పూజలు చేసి కుటుంబ సభ్యులు, పోలీసు సిబ్బంది వెంటరాగా వెళ్లి అమ్మవారికి సమర్పిస్తారు. రాత్రి 9 గంటల తరువాత అమ్మవారు మెట్టి నింటి నుంచి బయలుదేరేలా కమిటీ ఏర్పాట్లు చేసింది.





ఇంద్రకీలాద్రిపై

ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, స్వర్ణశిఖరానికి అభిషేకం చేస్తున్న పండితులు

మల్లేశ్వరాలయ పునఃప్రారంభం

- శాస్త్రోక్తంగా స్వర్ణశిఖరానికి కుంభాభిషేకం
- వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠ

వన్‌టౌన్, ఫిబ్రవరి 18: ఇంద్రకీలాద్రిపై భక్తుల శివనామ స్మరణల మధ్య ఆదివారం ఉదయం మల్లేశ్వరాలయం పునఃప్రారంభమైంది. స్వర్ణశిఖర ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వర్ణశిఖర ప్రతిష్ఠ సందర్భంగా శాస్త్రోక్తంగా కుంభాభిషేకాన్ని నిర్వహించారు. ఆలయ అర్చక బృందం, వేదపండితులు, వైదిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈవో రామారావు పర్యవేక్షించారు. దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు దంపతులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పూజల్లో పాల్గొన్నారు. ముహూర్త సమయంలో యంత్రప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానాచార్యుడు శివప్రసాదశర్మ, కోట ప్రసాద్, యజ్ఞనారాయణ శర్మ, శంకరశాండిల్య తదితర అర్చక బృందం హోమాలు, పూజలు నిర్వహించారు. ఉదయం 8 గంటలనుంచి క్రతువులు నిర్వహించారు. పునఃప్రారంభ కార్యక్రమంలో తాను పాల్గొనడం ఎన్నో జన్మల అదృష్టమని దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు.



నందీశ్వరుడికి పూజలు

శ్రీకాళహస్తి దేవస్థానం నుంచి పట్టువస్త్రాలు

మల్లేశ్వరాలయ పునఃప్రారంభం సందర్భంగా శ్రీకాళహస్తి దేవస్థానం ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ అంజూరు శ్రీనివాసు, ఆలయ అధికారులు, ప్రధాన అర్చకుడు పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. దుర్గగుడి ఈవో రామారావు, అర్చక బృందాలు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పట్టు వస్త్రాల సమర్పణ అనంతరం అమ్మవారిని, మల్లేశ్వరస్వామిని దర్శించుకున్నారు.



తిరుపతమ్మ, పరివార దేవతలకు

నీరాజనం

పల్లకీల్లో తరలుతున్న తిరుపతమ్మ, గోపయ్య, ఇతర పరివార దేవతలు



తిరుపతమ్మ



గోపయ్యస్వామి

- రంగుల ఉత్సవం అనంతరం పెనుగంచిప్రోలుకు పయనం
- జల బిందెలతో వార పోసి మొక్కులు తీర్చుకున్న మహిళలు, భక్తులు

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 18: రంగుల మహోత్సవానికి పట్టణానికి విచ్చేసిన గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారు, పరివార దేవతలు ఆదివారం ఉదయం తిరిగి పెనుగంచిప్రోలుకు బయల్దేరారు. తెల్లవారుజామున 5.15 గంటలకు దేవస్థానం వేదపండితులు ప్రత్యేక పూజలు చేశాక, అమ్మవారు, పరివార దేవతలను ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, దేవస్థానం చైర్మన్ జంగాల వాసు, దేవస్థానం ఈవో కె.రమేష్‌నాయుడు, అధికారులు దగ్గరుండి పల్లకీల్లోకి ఎక్కించారు. పెనుగంచిప్రోలు బయల్దేరిన అమ్మవారిని దర్శించుకునేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు పోటెత్తారు. భక్తులు వేలాదిగా తరలివచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు. పల్లకీల్లో ఉన్న అమ్మవారి పరివార దేవతలకు జలబిందెలతో వార పోసి మొక్కులు తీర్చుకున్నారు. రంగుల మండపం నుంచి కమలా సెంటర్‌కు రావటానికి 6గంటలు పట్టింది. పల్లకీలను మోసేందుకు, వారు పోసేందుకు, మొక్కులు తీర్చుకునేందుకు జగ్గయ్యపేట పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మెయిన్ రోడ్డుకు ఇరువైపులా వేచి ఉన్నారు. కాకతీయ కమ్మ సేవాసమితి సభ్యులు కమలా సెంటర్‌లో పెద్ద ఆర్చి ఏర్పాటు చేసి, భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు. టీడీపీ విజయవాడ పార్లమెంట్ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు శ్రీరాం చినబాబు, కమ్మసేవాసమితి అధ్యక్షుడు ఇంటూరి రంగనాయకులు, నూరపనేని సుబ్బారావు తదితరులు అమ్మవారి పల్లకీలను కాసేపు మోశారు.



సినీనటుడు మురళీమోహన్‌కు అక్కినేని శతజయంతి స్మారక పురస్కారాన్ని అందజేస్తున్న జస్టిస్ ఏవీ శేషసాయి

అజాత శత్రువు మురళీమోహన్

- అక్కినేని శత జయంతి వేడుకల్లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): సినీనటుడు మురళీమోహన్ రాజకీయ, చిత్రరంగంలో అజాత శత్రువని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి అన్నారు. అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నగరంలోని ఓ హోటల్‌లో అక్కినేని శతజయంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. మురళీ మోహన్‌కు అక్కినేని శతజయంతి స్మారక పురస్కారాన్ని అందజేశారు. అక్కినేని నవరస పోషకుడని శేషసాయి అన్నారు. మద్రాసు నుంచి సినీ పరిశ్రమను హైదరాబాద్‌కు తరలించడానికి ప్రధాన కారకుడు అక్కినేని అని వివరించారు. ఆయన స్మారక పురస్కారాన్ని అందుకోవడానికి మురళీమోహన్‌కు అన్ని అర్హతలు ఉన్నాయన్నారు. జీవితంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందడానికి అక్కినేని తనకు హితబోధ చేశారని వాటని తాను పాటించానని మురళీమోహన్ తెలిపారు. సినీ రచయిత సంజయ్ కిషోర్, నిర్వాహకుడు చీదెళ్ల నాగేశ్వరరావు, దామోదర గణపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశినేని చిన్ని

దళిత ద్రోహి సీఎం జగన్

- దళితులకు అమలవ్వాల్సిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేశారు
- వచ్చే ఎన్నికల్లో దళిత వ్యతిరేక ప్రభుత్వాన్ని ఓడించండి
- జైభీమ్ ఆర్మీ ఎన్టీఆర్ జిల్లా సమావేశంలో కేశినేని చిన్ని పిలుపు

భారతీనగర్: దళితులకు అమలవ్వాల్సిన 27 సంక్షేమ పథకాలు రద్దుచేసిన దుర్మార్గుడు, దళిత ద్రోహి సీఎం జగన్ అని టీడీపీ నాయకుడు కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. దళిత వ్యతిరేక జగన్ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో తరిమికొట్టాలని చిన్ని పిలుపునిచ్చారు. భారతీనగర్ కాలనీలోని అన్న క్యాంటీన్ ప్రాంగణంలో ఆదివారం జైభీమ్ ఆర్మీ ఎన్టీఆర్ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. అంబేడ్కర్ విదేశీ విద్యాదీవెన పథకం పేరు మార్చి జగనన్న విదేశీ విద్యాదీవెన పథకమని పెట్టుకున్నారన్నారు. నాలుగేళ్లుగా ఉద్యోగాలు లేక యువత మత్తు పదార్థాలకు బానిసగా మారుతోందని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఈనెల 22న జగ్గయ్యపేటలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులు పాల్గొని ఉద్యోగాలు పొందాలని సూచించారు. చిన్ని గెలుపు కోసం జైభీమ్ ఆర్మీ పనిచేస్తుందని జైభీమ్ ఆర్మీ ఫౌండర్ గొర్రెముచ్చు వెంకట నరసింహరావు తెలిపారు. జైభీమ్ ఆర్మీ కార్యవర్గ సభ్యులు చిన్నిని సన్మానించారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా, మైనారిటీ సెల్ రాష్ట్ర సెక్రటరీ ఎండీ ఫతావుల్లా, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం..బీఎల్వో సస్పెన్షన్

కూచిపూడి, ఫిబ్రవరి 18: బూత్ లెవల్ ఆఫీసర్(బీఎల్వో)గా బాధ్యతలు నిర్వహిస్తున్న మొవ్వ సచివాలయం-1 వెల్ఫేర్ అసిస్టెంట్ అవనిగడ్డ నాగమహేష్‌ను సస్పెండ్ చేస్తూ కృష్ణాజిల్లా కలెక్టర్ రాజాబాబు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎండీవో జి.చంద్రశేఖర్‌రావు తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వం వహించారని, ఓటర్ల జాబితాలో మరణించిన వ్యక్తుల పేర్లు తొలగించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారని పూర్వ తహసీల్దార్ కలెక్టర్‌కు ఇచ్చిన నివేదిక ఆధారంగా సస్పెన్షన్ వేటు పడిందని తెలిపారు. కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులను మహేష్ తీసుకోకుండా విధులకు గైర్హాజరు కావటంతో సస్పెన్షన్ ఉత్తర్వులను మహేష్ ఇంటి గోడకు అంటించామని ఎండీవో తెలిపారు.

మరో ఉద్దానంగా ఎ.కొండూరు

- కిడ్నీ బాధితులకు కృష్ణా జలాలు సరఫరా చేయండి: సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్

ధర్నాచౌక్, ఫిబ్రవరి 18: ఎన్టీఆర్ జిల్లాలోని ఎ.కొండూరు ప్రాంతం మరో ఉద్దానంగా మారనుందని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎ.కొండూరు ప్రాంత కిడ్నీ బాధితులతో కలిసి దాసరి భవన్‌లో ఆదివారం ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్యం, ప్రజా ప్రతినిధుల అలసత్వం వల్ల మండలంలోని 21 గ్రామ పంచాయతీలు, శివారు ప్రాంతాలైన తండాల ప్రజలు కిడ్నీవ్యాధితో బాధపడుతున్నారన్నారు. భూగర్భ జలాల్లో ఫ్లోరైడ్ అధిక శాతం ఉండటంతో తాగునీరు కరువైందన్నారు. ఆ ప్రాంతాలకు కృష్ణాజలాలను సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కిడ్నీ బాధితులకు ప్రతీనెలా రూ.10 వేల పింఛన్ ఇవ్వాలన్నారు. ఈ వ్యాధితో మృతి చెందిన వారి కుటుంబానికి రూ.10 లక్షలు ప్రకటించాలని, రెండున్నర ఎకరాల సాగు భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. డయాలసిస్ సెంటర్‌లో పర్మినెంట్ డాక్టర్లను నియమించాలని కోరారు.

రాబోయే పాతికేళ్లలో
మహాశక్తిగా భారత్

ఎస్ఆర్‌జీఈసీ రజతోత్సవ ముగింపు కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్



కేరింతలు కొడుతున్న విద్యార్థులు





మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, హాజరైన విద్యార్థులు, గ్రామస్థులు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 18: రాబోయే పాతికేళ్లలో ప్రపంచంలోనే అత్యంత నైపుణ్యం కలిగిన మహాశక్తిగా భారతదేశం నిలవనుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఆదివారం గుడ్లవల్లేరులోని శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ) రజతోత్సవ వేడుకల ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రపంచాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య అని, గ్రామీణ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందించాలనే లక్ష్యం, దూరదృష్టి, అభిరుచి, ఆలోచనలతో యాజమాన్యం ఎస్ఆర్‌జీఈసీని స్థాపించి ఉన్నత విద్యాప్రమాణాలతో కళాశాలను నడపడం అభినందనీయమని ఆయన అన్నారు. పాతికేళ్ల కళాశాల విద్యా ప్రయాణంలో ఇక్కడ విద్యనభ్యసించిన ఎంతోమంది దేశ విదేశాల్లో పేరెన్నికగన్న ప్రైవేటు సెక్టార్లలో, రాష్ట్ర, జాతీయ ప్రభుత్వ సంస్థల్లో, పరిశోధనా సంస్థల్లో కొలువుదీరడం ప్రశంసనీయమన్నారు. తొలుత కలెక్టర్ పి.రాజాబాబు, ఎస్పీ నయీం అస్మీ, గుడివాడ ఆర్డీవో పద్మావతి, కళాశాల చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావులు గవర్నర్‌కు పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. సభా కార్యక్రమాన్ని గవర్నర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఏఏఎస్ఎం అండ్ వీవీఆర్ఎస్ఆర్ ఎడ్యుకేషన్ సొసైటీని స్థాపించిన అడుసుమిల్లి అశ్వర్థనారాయణ మూర్తి, వల్లూరుపల్లి వెంకటరామశేషాద్రిరావు కుటుంబ సభ్యులకు కృతజ్ఞతాంజలి సన్మానపత్రాలను గవర్నర్ అందజేశారు. కళాశాల యాజమాన్యం గవర్నర్‌ను ఘనంగా సన్మానించింది. చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కో-చైర్మన్ ముసునూరి శ్రీనివాసరావు, కార్యదర్శి వల్లూరుపల్లి సత్యనారాయణరావు, సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ, సంస్థ అధ్యక్షుడు వల్లభనేని సుబ్బారావు, ఉపాధ్యక్షులు కొడాలి వెంకట కృష్ణారావు, గవర్నింగ్‌బాడీ సభ్యులు వల్లూరుపల్లి వెంకట్ కిరణ్, ముసునూరి శ్రీరామ్, ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్స్ వి.కోదండరామారావు, ఎంఆర్‌సీహెచ్‌శాస్త్రి, యాజమాన్య సలహాదారు పొట్లూరి రవీంద్ర బాబు, పీజీసీ ఆర్డీ డైరెక్టర్ జి.వి.ఎస్.ఎన్.ఆర్.వి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉర్రూతలూగించిన సినీగీతాలాపన

రజతోత్సవ వేడుకల ముగింపు సందర్భంగా నిర్వహించిన మ్యూజికల్‌నైట్ విద్యార్థులను ఉర్రూతలూగించింది. సినీ సంగీత దర్శకుడు అనూప్‌రూబెన్స్, గాయకులు ధనుంజయ్, సాహితీ బృందం చేసిన సినీ గీతాలాపన విద్యార్థులను కేరింతలు కొట్టించింది.

రసాభాసగా..

పట్టాభి స్మారక భవన అనుమతులపై అఖిలపక్ష సమావేశం



మేకల సుబ్బన్నతో మాట్లాడుతున్న జనసేన నాయకులు కొట్టె వెంకట్రావు, మాదివాడ రాము

- పట్టాభి భవన కమిటీ కరపత్రాలు చించేసిన వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న
- వాగ్వివాదాల మధ్య ముగిసిన సమావేశం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18: భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి మునిసిపల్ కౌన్సిల్ అనుమతుల కోసం ఆదివారం వివేకానంద మందిరంలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం రసాభాసగా ముగిసింది. వివిధ రాజకీయ పార్టీల నాయకులు, నగర పెద్దలు హాజరయ్యారు. భవనాన్ని నిర్మించడంలో జాప్యం జరిగితే యూనియన్ బ్యాంకు మంజూరు చేసిన నిధులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందని బందరు అభివృద్ధిని ఆకాంక్షించే రాజకీయ పార్టీ నాయకులందరూ ఏకం కావాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్దుల్ మతిన్, టీడీపీ నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా కోరారు. సీఎం నుంచి పట్టాభి భవనానికి కావలసిన స్థలాన్ని, యూనియన్ బ్యాంకు నుంచి రూ.40 కోట్ల నిధులను ఎంపీ వల్లభనేని బాలశౌరి తీసుకుని వచ్చారని, అయితే నగరపాలక సంస్థ భవన నిర్మాణానికి ఎన్వోసీ ఇవ్వడానికి ఎందుకు ముందుకు రావడంలేదో తెలియడం లేదని, దీనిపై కలెక్టర్ చెప్పినా మునిసిపల్ కౌన్సిల్‌లో పాలకవర్గం తీర్మానం ప్రవేశపెట్టడం లేదని న్యాయవాది, భవన నిర్మాణ సాధక కమిటీ కన్వీనర్ సోడిశెట్టి బాలాజీ అన్నారు. దీంతో కలెక్టరుకు, మునిసిపల్‌కమిషనర్‌కు వినతిపత్రాలు ఇస్తే సరిపోతుందా.. మేయర్‌ను ఎవరు అడిగారని వైసీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న ప్రశ్నించారు. మీరే వినతి పత్రాలు తీసుకుని పని పూర్తి చేయించండి అని సుబ్బన్నతో బాలాజీ అన్నారు. అనంతరం సుబ్బన్న భవన నిర్మాణ సాధన కమిటీ ముద్రించిన కరపత్రాలను చించేశారు. దీంతో సభ రసాభాసగా మారింది. టీడీపీ ప్రచార కార్యదర్శి పీవీ ఫణికుమార్, మేకల సుబ్బన్న మధ్య తీవ్రంగా వాదోపవాదాలు జరిగాయి.

సీఎం ఉత్తర్వులిచ్చారు..అనుమతులివ్వండి:జనసేన

వాదనలు జరుగుతుండగా జనసేన నాయకుడు మాదివాడ రాము, కొట్టె వెంకట్రావులు జోక్యం చేసుకుని మాట్లాడారు. సీఎం ఉత్తర్వులు ఇచ్చారని, కలెక్టర్ ఇందుకు కావలసిన రెండెకరాలు స్థలం కేటాయించారని, జగన్‌పై గౌరవంతో భవన నిర్మాణానికి వైసీపీ కార్పొరేటర్లు మునిసిపల్ కౌన్సిల్‌లో అనుమతులు ఇవ్వాలని సూచించారు. పట్టాభి స్మారక భవన నిర్మాణానికి కావలసిన స్థలాన్ని వేరే చోట కొనుక్కోవడం మంచిదని, పట్టాభి స్మారక భవనానికి కలెక్టర్ కేటాయించిన స్థలాన్ని 30 ఏళ్ల లీజుకు తీసుకుని వైసీపీ కార్యాలయ భవనం, క్రీడా భవనం నిర్మాణాలు జరుగుతున్నాయని అర్బన్ బ్యాంకు మాజీ అధ్యక్షుడు బొర్రా విఠల్ అన్నారు. అక్కడ మిగిలి ఉన్న స్థలం పోలీసు శాఖదన్నారు. దీంతో పీవీ ఫణికుమార్‌కు బొర్రా విఠల్‌కు మధ్య వాదోపవాదాలు జరిగాయి. పట్టాభి భవనానికి కేటాయించిన స్థలం ఇవ్వాలని రాజకీయపార్టీల నాయకులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకుడు కె.చంద్రశేఖర్, న్యాయవాది పుప్పాల ప్రసాద్, సీపీఎం నాయకుడు కొడాలి శర్మ, టీడీపీ నాయకుడు పిప్పళ్ల కాంతారావు, జనసేన నగర అధ్యక్షుడు గడ్డం రాజు, డాక్టర్ బి.ధన్వంతరి ఆచార్య సింగరాజు గోవర్ధన్ పాల్గొన్నారు.



శిథిలావస్థకు చేరిన కృష్ణవేణమ్మ విగ్రహం





కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న బాల దేవాలయాలు, మరమ్మతులు లేని వసతి భవనం

హంసలదీవి పవిత్ర సంగమంలో

కానరాని అభివృద్ధి

కోడూరు, ఫిబ్రవరి 18: హంసలదీవిలో కృష్ణా సాగర సంగమ క్షేత్రం అభివృద్ధి నోచుకోవటం లేదు. నాలుగేళ్లుగా పవిత్ర సంగమం వద్దకు ఎవరూ వెళ్లకుండా అధికారులు భద్రత పేరుతో ఆంక్షలు విధించటంతో ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా మారింది. సంగమ ప్రదేశంలో నిర్మించిన రెండు అంతస్థుల భవనం శిథిలావస్థకు చేరింది. దేవతా విగ్రహాలు, కృష్ణమ్మ పాదాలు పగుళ్లిచ్చాయి. అయినా అధికారులు పట్టించుకోలేదు. ఫిబ్రవరి 24వ తేదీన మాఘశుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు సంగమ ప్రదేశంలో స్నానమాచరించేందుకు హంసలదీవి రానున్నారు. కానీ అధికారులు మాత్రం భద్రత పేరుతో పవిత్ర సంగమానికి అనుమతించమని చెప్పటంతో భక్తులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కనీసం పవిత్ర సంగమ విశిష్టతను కాపాడేందుకు భక్తుల మనోభావాలను గౌరవిస్తూ జల్లు స్నానాలైనా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



టీడీపీలో చేరిన యువకులతో ప్రమాణం చేయిస్తున్న కొల్లు రవీంద్ర

యువత భవితకు శాపంగా వైసీపీ ప్రభుత్వం

- అందుకే యువకులంతా టీడీపీలోకి వస్తున్నారు: కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18: ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం యువత భవితకు శాపంగా మారడంతో యువత టీడీపీలో చేరుతున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర అన్నారు. ఆదివారం టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో వైసీపీ నాయకుడు కళ్లేపల్లి రాణాప్రతాప్ ఆధ్వర్యంలో బుట్టాయిపేట, సుకర్లాబాద్, రాజుపేట, దిమ్మలసెంటర్, చిలకలపూడి ప్రాంతాల నుంచి 150 మంది యువకులు పార్టీలో చేరారు. యువకులకు కొల్లు రవీంద్ర పార్టీ కండువాలు కప్పి ప్రతిజ్ఞ చేయించారు. ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తానని యువతీ యువకులను మోసం చేసి ఓట్లు దండుకున్న వైసీపీకి రానున్న ఎన్నికల్లో యువత తగిన బుద్ధి చెబుతారన్నారు. జగన్ పాలనలో గ్రాడ్యుయేట్లు వలంటీర్లుగా చాలీచాలని జీతాలతో బతుకుతున్నారన్నారు. కె.నిఖిలేష్, కె.మూర్తి, కె.సుధాకర్, సురేంద్రప్రసాద్, మహి, అజయ్, లాలా, బాలు, అభినవ్, భారతరెడ్డి, యశ్వంత్, గణేష్, ప్రవీణ్, జి.సుబ్రహ్మణ్యం తదితరులు పార్టీలో చేరారు. మోటమర్రి బాబా ప్రసాద్, హసీంబేగ్, చిత్తజల్లు నాగరాము, దేవరపల్లి అనిత, దింటకుర్తి సుధాకర్, ఎండీ ఇలియాస్ పాషా, పిప్పళ్ల కాంతారావు పాల్గొన్నారు.

ఖో-ఖో జిల్లా జట్ల ఎంపిక

గుడివాడ: ఎస్పీఎస్ మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కృష్ణాజిల్లా ఖో-ఖో పురుషులు, మహిళ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. మహిళల జట్టుకు కె.కుమారి, టి.ఝాన్సీరాణి, కె.చైతన్య, అఖిల, ఎం.దుర్గాభవాని, బి.మౌనిక, బి.నాగసుశీల, జి.దీప్తి, ఎ.దేవి, టి.జ్యోతి, హురున్నీసా, ఎం.లావణ్య, బి.శివస్వప్న, ఎస్.ధనలక్ష్మి, జి.అనిత, స్టాండ్‌బైలు డి.చరితశ్రీ, కె.ఊర్మ, అభిజ్ఞలు ఎంపికయ్యారు. పురుషుల జట్టుకు కె.కొండలరావు, బి.వినయ్, టి.తిమోతి, సీహెచ్ అజయ్‌కుమార్, జి.హస్మల్, సీహెచ్ గణేష్, రాకేష్, జె.నాగశేషు, డి.షణ్ముఖ శ్రీనివాస్, ఆసిఫ్‌ఖాన్, కె.జగదీష్, కె.జయసూర్యతేజ, పి.అభిషేకం, డి.దుర్గాప్రసాద్, సీహెచ్ రేవంత్‌కుమార్, స్టాండ్‌బైలుగా యు.నాగరాజు, గణేష్‌నాయుడు, భరత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు సామర్లకోట ప్రభుత్వ కళాశాలలో నిర్వహించే అంతర్ జిల్లాల ఖో-ఖో పోటీల్లో ఎంపికైన జట్లు పాల్గొంటాయని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మడక ప్రసాద్, మద్దినేని సత్యప్రసాద్ తెలిపారు.

అన్ని పీఎస్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి

- ఎన్నికల సంఘాన్ని కోరిన ఏపీ టుమారో

విజయవాడ, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఏపీ టుమారో స్వచ్ఛంద సంస్థ కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరింది. సంఘ అధ్యక్షుడు నలమోతు చక్రవర్తి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం పోలీసులను రాజకీయ కక్షలకు ఉపయోగించుకుని అధికార దుర్వినియోగం చేస్తోందని వినతిపత్రంలో పేర్కొన్నారు. ప్రజల హక్కులను కాపాడడంలో భాగంగా సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అన్ని పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్ర డీజీపీ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైసీపీ చేతకాని పాలనపై అడుగుదాం ఆంధ్రా 25న

ఉయ్యూరు, ఫిబ్రవరి 18 : రాష్ట్రంలో అవినీతి, అరాచక, చేతకాని పాలనపై తెలుగు యువత ఆధ్వర్యంలో ఎక్కుపెట్టిన బాణం అడుగుదాం ఆంధ్రా అని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి అన్నారు. చేతనకాని పాలన, ప్రతియేటా జాబ్‌క్యాలెండర్ విడుదల చేస్తా మన్న హామీతో యువతను మోసం చేసిన వైసీపీని ఎండగడుతూ అడుగుదాం ఆంధ్రా పేరుతో ఈ నెల 25న ఉయ్యూరు బైపాస్ సమీపాన బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ బహిరంగ సభకు ముఖ్య అతిథిగా శ్రీకాకుళం ఎంపీ కింజరపు రామ్మోహన్‌నాయుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావు, ఏడు నియోజకవర్గాల టీడీపీ ఇన్‌చార్జిలు పాల్గొంటున్నట్టు తెలిపారు. తెలుగు యువత, పార్టీ నాయకులు, జనసైనికులు, ఇరు పార్టీల కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ ఉత్సవ పూజలు



సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

గన్నవరం, ఫిబ్రవరి 18 : మండలంలోని సూరంపల్లి సీతారామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు అంగరంగ వైభవంగా రెండవ రోజు కొనసాగాయి. ఆదివారం దంపతుల చేత సామూహిక పూజలను వేదపండితులు చేయించారు. శ్రీ గణపతి, శ్రీకృష్ణ, ధ్వజ, శిఖర పూర్వక హనుమత్ లక్ష్మణ సహిత శ్రీ సీతారామ చంద్రస్వామి విగ్రహాల ప్రతిష్ఠకు వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాలలో హోమాలు చేశారు. ధ్వజస్తంభాన్ని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉంచి గ్రామ పుర వీధులలో ఊరేగింపు నిర్వహించారు.

నేటి నుంచి సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు

ఉయ్యూరు, ఫిబ్రవరి 18 : ఉయ్యూరులో జగదంబా సమేత సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు సోమవారం నుంచి శనివారం వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఆలయ పాలక మండలి చైర్మన్ సీహెచ్ వీవీ కుటుంబరాజు, కార్యనిర్వహణాధికారి కానూరి సురేశ్‌బాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా 23న వీరభద్ర పళ్లెం, వృషభ వాహనోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

బీజేపీవి గొంతెమ్మ కోర్కెలు

టీడీపీ నేత బొప్పూడి శివరామకృష్ణ

కంకిపాడు, ఫిబ్రవరి 18 : ఒక్కశాతం ఓటు బ్యాంక్ లేని బీజేపీకి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో 75 సీట్లు ఇవ్వాలంటూ కొందరు నాయకులు డిమాండ్ చేయడం గొంతెమ్మ కోర్కెలుగా తెలుగుదేశం పార్టీ మండల పార్టీ కార్యాలయ బాధ్యుడు బొప్పూడి శివరామకృష్ణ అభివర్ణించాడు. ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో బీజేపీకి ఒక్కశాతం కూడా ఓటు బ్యాంక్ లేదని, తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకున్న రెండు, మూడు సార్లు మాత్రమే రాష్ట్రంలో ఎమ్మెల్యేలుగా బీజేపీ నాయకులు గెలిచారని, ఆ తరువాత ఆ పార్టీ నాయకులకు డిపాజిట్లు కూడా రాలేదన్నారు. బీజేపీ నాయకులు మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకుంటే తమకు అన్ని సీట్లు, ఇన్ని సీట్లు కావాలంటూ డిమాండ్ చేయడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో స్థానిక టీడీపీ నాయకులు పులి శ్రీని వాసరావు, షేక్ బాజి, ఏనుగ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని యువకుడి మృతి

పాయకాపురం: ఉరేసుకుని ఓ యువకుడు మృతి చెందిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. నున్న గ్రామానికి చెం దిన కందుల రాకేష్ (22) గ్రామ పంచాయతీలో అవు ట్ సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నాడు. ఆ దివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరు లేని సమయం లో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుధ్యం అధ్వానం

- అడుగడుగునా చెత్తకుప్పలు
- డ్రెయిన్లలో నిలిచిపోయిన మురుగు
- దుర్వాసన, దోమలతో ప్రసాదంపాడు వాసుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ప్రసాదంపాడు డ్రెయిన్లలో నిలిచిపోయిన మురుగు.. డ్రెయిన్ల పక్కన చెత్తకుప్పలు

గుణదల, ఫిబ్రవరి 18 : ప్రసాదంపాడులో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు.. ప్రవహించని మురుగు కాల్వలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యం వహించడంతో నానాటికి సమస్య తీవ్రమవుతుఉంది. యాదవుల బజార్‌కు చివరన ఎస్‌సీ కాలనీలో ఎక్కడ చూసినా చెత్తకుప్పలే దర్శమిస్తున్నాయి. మురుగు కాల్వలు పూడిక తీయకపోవడం వల్ల మురుగునీరు ప్రవహించక దోమల విజృంభణతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికే అనేక మంది దోమల బెడదతో రోగాల బారిన పడ్డారు. దీనికి తోడు పంచాయతీ పరిధిలోని జాతీయ రహదారిపై వీధిలైట్లు లేక గ్రామస్థులు ఇబ్బది పడుతున్నారు. గ్రామస్థులు నిలదీస్తే అది మా బాధ్యత కాదు... మున్సిపల్ కార్పొరేషన్ బాధ్యత అంటూ పంచాయతీ అధికారులు, పాలకులు చేతులు దులిపేసుకుంటు న్నారు కోట్ల రూపాయలు వెచ్చించి రామవరప్పాడు రింగ్ నుంచి గన్నవరం విమానాశ్రయం వరకు ఫుట్‌పాత్‌లను సుందరీకరణ చేయించి, ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహించకుండా చూడాలని విజయ వాడ మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేసినా, పంచాయతీ కార్యదర్శి మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో కమిషనర్ స్వయంగా పరిశీలించి వ్యాపారులపై చర్యలు తీసుకున్నా, కార్యదర్శి పట్టించుకోకపోవడంపై తీవ్రవిమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ కార్యదర్శిగాని, సర్పంచ్‌గాని స్పందించకపోవడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామంలో పారిశుధ్యం మురుకాల్వల పూడికతీత పనులు చేపట్టాలని, ప్రజలను అనారోగ్యం బారిన పడకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయంపై కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్‌ను వివరణ కోరగా పారిశుధ్యంపై దృష్టి పెడతామని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని తెలిపారు.

రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం

కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు

గన్నవరం, ఫిబ్రవరి 18 : ధాన్యం బకాయిలు చెల్లించకుండా రైతులను ప్రభుత్వం మోసం చేసిందని కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పంచకర్ల రంగారావు మండిపడ్డారు. స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ధాన్యం బకాయిల కోసం ఈ నెల 22న విజయవాడ పౌర సరఫరాల శాఖ కార్యాలయం వద్ద సామూహిక రాయబారం కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. వ్యవసాయం దినదిన గండంగా మారుతుందని పంట విత్తిన రోజు నుంచి చేతికి వచ్చే వరకూ అనేక ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. రైతు సంఘం జిల్లా నాయకుడు సూరగాని సాంబశివరావు మాట్లాడుతూ, అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం కూడా అందలేదన్నారు. ధాన్యం రంగు మారటం వల్ల మిల్లర్లు, దళారులు ధర తెగ్గోసి కొన్నారన్నారు. ఆర్‌బీకేల ద్వారా ధాన్యం విక్రయిస్తే జనవరి 13 తరువాత రైతుల ఖాతాల్లో నగదు జమ కాలేదన్నారు. అప్పులు తెచ్చి వ్యవసాయం చేసిన రైతులకు ధాన్యం అమ్మిన నగదు సకాలంలో రాకపోవటంతో వడ్డీలు పెరిగి లబోదిబోమంటున్నారన్నారు. ఈ సమావేశంలో మిరప నాగేశ్వరరరావు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 18 : అనారోగ్యంతో బాధపడుతున్న ఇద్దరికి టీడీపీ నేత, ప్రముఖ న్యాయవాది తగరం బసవ కిరణ్‌బాబు ఆదివారం ఆర్థిక సాయం అందజేశారు. నున్నకు చెందిన బండ్రపల్లి అశోక్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలతో కిరణ్‌బాబు అశోక్‌బాబును పరామర్శించి రూ. 5 వేలు అందజేశారు. అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చిన మరియ దాస్‌కు రూ. 5 వేలు అందజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు కలకోటి శ్రీనివాస రెడ్డి, మాదు శివరాంప్రసాద్, బోకినాల తిరుపతిరావు, కృష్ణ శ్రీనివాస్ యాదవ్, వల్లూరి వెంకటశివ, మురళీ, నవీన్, కోటేశ్వరరావు, చందు ఉన్నారు.

జగన్‌ను గద్దె దింపేందుకు యువత కసిగా ఉంది

టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు



ఎనికేపాడులో పర్యటిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు

గుణదల, ఫిబ్రవరి 18 : జగన్‌ను గద్దె దింపేందుకు యువత ఎంతో కసిగా ఉన్నారని టీడీపీ గన్నవరం ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. ఆదివారం ఎనికేపాడులో జరిగిన పార్టీ కార్యాలయ ప్రారంభ కార్యక్రమానికి తెలుగు యువత, పార్టీ కార్యకర్తలతో కలిసి మోటారు బైక్‌పై ర్యాలీగా వచ్చారు. పార్టీ కార్యాలయ ప్రారంభం అనంతరం ఎనికేపాడుకు చెందిన 50మంది యువత యార్లగడ్డ సమక్షంలో కండువా కప్పుకుని తెలుగుదేశం పార్టీలో చేరారు. అనంతరం ఎనికేపాడు బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల్లో పర్యటిస్తూ స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 2024లో చంద్రబాబు అధికారంలోకి రాగానే అమలు చేయనున్న పథకాల జాబితాకు సంబంధించిన కరపత్రాలను ఓటర్లకు అందజేశారు. అటు ప్రభుత్వ ఉద్యోగులు ఇటు ప్రైవేటు కార్మికులు ప్రభుత్వం వ్యవహరిస్తున్న ఒంటెద్దు పోకడలపై తీవ్రవ్యతిరేకతతో ఉన్నారని చెప్పారు. జనసేన, టీడీపీ కలయికతో గన్నవరం నియోజకవర్గంలో టీడీపీ జెండా రెప రెపలాడటం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎనికేపాడు మాజీ సర్పంచ్ కోనేరు శివ రామకృష్ణ (పెదబాబు), పార్టీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చినరామారావు, ప్రధాన కార్యదర్శి కోనేరు సందీప్, ప్రసాదంపాడు మాజీ సర్పంచ్ బొప్పన హరికృష్ణ, పార్టీ నాయకులు గూడవల్లి నరసయ్య, సర్నాల బాలాజీ, చాగంటిపాటి కృష్ణ, తెలుగు యువత నాయకుడు పరుచూరి నరేష్, మాదు పాండు, తేజ, గుర్రం అనీల్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణమూర్తి ఇంటిపై దాడి నిందితులను అరెస్ట్ చేయాలి

ఉంగుటూరు : ఉంగుటూరులోని ఈడ్పు గంటి కృష్ణమూర్తి ఇంటిపై ఇటీవల గుర్తుతెలియని దుండగులు దాడి చేయడాన్ని గన్నవరం టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఖండించారు. కృష్ణమూర్తి ఇంటికి స్వయంగా వెళ్లిన ఆయన జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోకపోగా ఉచిత సలహాలు ఇచ్చారని కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన వెంకట్రావు పోలీసు అధికారులతో ఫోన్లో మాట్లాడారు. ఈ కేసుపై దృష్టిసారించి, వెంటనే దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధైర్యపడవద్దని తాను అన్నివిధాలుగా అండగా వుంటానని ఈ సందర్భంగా కృష్ణమూర్తికి యార్లగడ్డ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా, మండల పార్టీ అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి, నాయకులు కొసరాజు సాయి, అయ్యప్పరెడ్డి, నెక్కలపూడి రాజమన్నార్, చల్లగుళ్ల షణ్ముఖ్, నక్కా వెంకటేశ్వరరావు, మాయర రమేష్, శంకరరావు, శివ, గోపి, భరత్, పోతినేని రామకృష్ణ, తేలు సత్యనారాయణ, దాసరి రామకృష్ణ, చింతా చంద్రశేఖర్, జోషి, కుమ్మరి వెంకటేశ్వరరావు, లోకేశ్వరరావు, వెంకయ్య పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ వైసీపీ

మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్



యనమలకుదురులో టీడీపీ మేనిఫెస్టోను ప్రచారం చేస్తున్న బోడె హేమ

పెనమలూరు, ఫిబ్రవరి 18 : అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ ప్రభుత్వం మార్చేసిందని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కానూరు 29వ డివిజన్‌లో ఆదివారం జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ, యువ నాయకుడు, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాడన్న నమ్మకంతో ప్రజలు ఒక్క చాన్స్ ఇచ్చి జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేశారన్నారు. దొరికిందే తడువుగా రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశాడన్నారు. లక్షల కోట్లు దోచుకుంటూ రాష్ట్రాన్ని దివాలా తీయించారని మండిపడ్డారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్ర భవిష్యత్ బాగుండాలన్నా, వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, చంద్రబాబుని ముఖ్యమంత్రి చేయాల్సిన అవసరముం దన్నారు. ఈ కార్యక్రమంలో వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకర్, కోయా ఆనంద్, అంగిరేకుల మురళి, మోహమద్ ఇక్బాల్, సుంకర సాయి, కోసూరు రమేష్, అబ్దుల్ రహమాన్, షేక్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

యనమలకుదురులో..

యనమలకుదురు ఆర్‌సీఎం చర్చి వద్ద నుంచి ఆదివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సతీమణి హేమ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమం లో అనంతనేని ఆజాద్, మొక్కపాటి శ్రీనివాసరావు, శొరి శివరామప్రసాద్, షేక్ షకీల, మల్లంపాటి విజయలక్ష్మీ, జి. శ్రీను, మెకానిక్ శివ, కొడాలి ఉమ, భూక్యా రాజా, మండల రజని, సింగం సుబ్రహ్మణ్యం, జనేసన నాయకుడు తాడిపూడి గణేష్, గంధం సురేష్, వడ్డే జీవ, కరిమికొండ బాబు, పొత్నూరు రాజు, వెన్నెంరెడ్డి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అవినీతిమయం

ఉయ్యూరు : పెరిగిన పప్పు, నూనె, బియ్యం ఇతర నిత్యావసరాల ధరలతో సామాన్య మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది పడుతుంటే కరెంటు, బస్సు చార్జీలు పెంచి ప్రభుత్వం మరింత భారం మోపిందని తెలుగుదేశం నేతలు దేవినేని గౌతమ్, స్మిత ఆందోళన వ్యక్తం చేశారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉయ్యూరు 16వ వార్డులో పర్యటించి చంద్రబాబు మినీ మేనిఫెస్టోలో ప్రకటించిన సంక్షేమ అభివృద్ధి పథకాలు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసీపీ చేతకాని, అరాచక పాలనతో ప్రజలు విసిగి తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం కోసం ఎదురు చూస్తున్నారని పర్యటనలో ప్రజాభిప్రాయం తెలుస్తుందన్నారు. రాష్ట్ర పురోభివృద్ధికి టీడీపీని తిరిగి అధికారం లోకి తెచ్చేందుకు ప్రజలు ఉత్సాహంగా ఉన్నారని స్పష్టమవుతుందన్నారు. పార్టీ నాయకులు నరేంద్ర, సాంబశివరావు, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయాలి

ఈడాక్ ప్రతినిధి అభిశాంత్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 18 : విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీసి స్టేక్‌పియర్ పోయేలా వారిని ప్రోత్సహించేందుకే అకడమిక్ ఎక్స్‌పో నిర్వహిం చడంలోని ముఖ్య ఉద్దేశమని ఈడాక్ ప్రతినిధి అభిశాంత్ అన్నారు. ఆరుగొలనులో ఆదివారం ఈడాక్ ఆధ్వర్యంలో సిద్ధార్థ విద్యాలయ సహకారంతో అకడమిక్ ఎక్స్‌పో నిర్వహించారు. తల్లిదండ్రుల అభిప్రాయాలను పిల్లలపై రుద్దకుండా వారి ఆలోచన, అభిప్రా యాలను స్వతంత్రంగా వ్యక్తపరచేలా పాజిటివ్ పేరెంటింగ్ విధానంలో పెంచాలని ఈడాక్ ప్రతినిధి అభిశాంత్ తల్లిదండ్రులకు సూచించారు. వివిధ సామాజిక, విద్యా సంబంధిత విషయాలపై ప్రైమరీ స్కూల్ చిన్నారుల వేషధారణ, ఆహారపదార్థాల్లో మంచిచెడు(జంక్‌ఫుడ్,హెల్దీఫుడ్)లు వివరించేలా చిరు నాటికలు అహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ విద్యాలయ కరస్పాండెంట్ కోనేరు సురేష్‌బాబు, ధనలక్ష్మి, శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



సంస్కృతీ సంప్రదాయాలపై వేషధారణలో విద్యార్థులు

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఉంగుటూరు, ఫిబ్రవరి 18 : మండలంలో 2022-23 సంవత్సరంలో ఉపాధిహామీ పథకం కింద చేసిన పనులపై 27 గ్రామాల్లో సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) ఆదివారం నుంచి ప్రారంభించినట్లు ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీవో టి.వినీల తెలిపారు. స్టేట్ రిసోర్స్‌పర్సన్ సీహెచ్ రాజు ఆధ్వర్యంలో ఆరుగురు డీఆర్‌పీలు, 12మంది వీఎస్‌ఏలు కలిసి ఆరు బృందాలుగా ఏర్పడి ఈ నెల 28 వరకు అన్ని గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఈ సందర్భంగా గ్రామసభల షెడ్యూల్‌ను వివరించారు. ఈ నెల 20న నందమూరు, నారయ్యఅప్పారావుపేట, తేలప్రోలు, గారపాడు, పొట్టిపాడు, 21న మానికొండ, 23న వేమండ, ముక్కపాడు, ఆత్కూరు, పొణుకు మాడు, పెదఅవుటపల్లి, 24న వేంపాడు, 25న ఆముదాలపల్లి, లంకపల్లి అగ్రహారం, కొయ్యగూరపాడు, 26న వెల్దిపాడు, చాగంటిపాడు, 27న తరిగొప్పల, 28న వెన్నూతల, ఎలుకపాడు, చికినాల, ఉంగుటూరు, ఇందుపల్లి, తుట్టగుంట, బొకినాల, నాగవర ప్పాడు, మధిరపాడు గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామసభలు జరుగుతాయని ఏపీవో వినీల తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పాయకాపురం, ఫిబ్రవరి 18: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నున్న పాలెం ఆదివారం అడ్డరోడ్డులో జరిగింది. నున్న గ్రామానికి చెందిన ఎస్‌కే నా గూల్ షరీఫ్ (27) కూలీ పనులు చేస్తుంటాడు. ఆదివారం ఇంటి నుంచి తన ద్విచక్రవాహనంపై బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం ఇంటికి తిరిగొస్తుండగా పాలెం అ డ్డరోడ్డు వద్ద ఏపీ 16డీక్యూ 3033 నెంబరు గల వా హనం ఢీకొంది. ఈ ఘటనలో నాగూల్ షరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. నున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోర్టు ప్రకటన

మహారాజశ్రీ విజయవాడ 14వ అదనపు జిల్లా జడ్జి కోర్టులో G.W.O.P నెం: 5/2024
పిటీషనర్ :-
1) కొత్తపల్లి జస్సి శ్రేయస్ వయస్సు 15సం॥
2) కొత్తపల్లి రిత్విక్ చౌదరి, వయస్సు 9సం॥లు పై వార్లు మైనర్లు అయినందున వారి తరుపున వారి అమ్మమ్మ పొట్లూరి మధు రత్నకుమారి ......పిటీషనర్
మరియు
నిల్ ....రెస్పాండెంట్స్

పై నెంబరు G.W.O.P లో పిటీషనర్స్ మైనర్లు అగుట చేత, వారి అమ్మమ్మ ను గార్డియన్ గా కోర్టు వారు G.W.O.P లో గార్డియన్ గా అనుమతి ఇవ్వవలసినదిగాను, ఈదిగువ షెడ్యూలు ఆస్తిని అమ్ముకొనుటకు అనుమతి కోరుచూ పిటీషన్ దాఖలు చేసినారు. జనుక పై విధముగా చేయుట ఎవరికైన అభ్యంతరములు యెడల పై కోర్టు వారి ఎదుట ది.14-03-2024 వతేదిన ఉదయం గం॥ 10.30ని॥లకు హాజరై తమకు గల ఆక్షేపణలు తెలుపుకోన వలెను. లేనియెడల శ్రీ కోర్టువారు తదుపరి ఉత్తర్వులు జారీ చేయగలరని తెలియజేయడమైనది.

Schedule :-

Item No:1 Krishna district, SRO Patamata with in limits of Yanamalakuduru Gram Panchayat Area, Yeanamalakuduru Village, Penamaluru mandal, Property of an extent of ac 1.02 cents or 0.4127 Hectors in R.S No.89/3 is being Bounded by:- East: land belongs by Kothapalli Jawaharlal Nehuru, South: land belongs to Velagapudi Subba Rao, West: Land belongs to Velagapudi Subbarao & others, North: Donka

Item:2 Krishna District, SRO Kankipadu within limits of Vanukuru Gram Panchayat Area Vanukuru Village, Kankipadu mandal Property of an extent of 526.87 Sq.yards or 440.52 Sq.mtrs in R.S No: 169/1 is Bounded by:` East: Poperty in Plot No:3 belongs to Potluri Mahesh Babu South: Property of Sree Ranga Vijaya Lakshmi , West: Property of others, North: 45' ft Road.

(శ్రీకోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది: 14-03-2024,
ఇట్లు:-
యం. సురేష్
పిటీషనర్ తరపు న్యాయవాది
విజయవాడ-3. ఫోన్ : 9392678899

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	149, 158, 169
చికెన్ విత్ స్కిన్	288
చికెన్ స్కిన్‌లెస్	298

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.42

కార్పొరేషన్ నిధుల దుర్వినియోగం : టీడీపీ ధ్వజం

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 : మచిలీపట్నం నగర కార్పొరేషన్ నిధులను వైసీపీ పాలకులు దుర్వినియోగం చేస్తున్నారని, ఇష్టారాజ్యంగా కౌన్సిల్ ఏజెండాలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు ఏడాదికి రూ.6.50 లక్షలు ఇచ్చేందుకు తీర్మానించడం దురదృష్టకరమని టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కౌన్సిల్ సమావేశాల్లో సమస్యలపై ప్రశ్నిస్తుంటే వైసీపీ కార్పొరేటర్లు సమాధానం చెప్పలేక వాగ్వాదానికి దిగుతున్నారన్నారు. నగర ప్రజలు వాస్తవాలు తెలుసుకుంటున్నారన్నారు. తెలుగుదేశం హయాంలో నిర్మాణాలు చేపట్టిన రెండు వాటర్ రిజర్వాయర్లను ఇంకా ప్రారంభించలేదన్నారు. తాగునీటి పైపులైన్ల లీకుల కారణంగా తాగునీరు కలుషితమవుతోందన్నారు. వేసవి కాలంలో తాగునీటికి ఇబ్బంది లేకుండా అధికారులు చూడాలన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పవళింపు సేవ

● ముగిసిన బ్రహ్మోత్సవాలు

మోపిదేవి : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పవళింపు సేవ ఆదివారం వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, పూజాకార్యక్రమాలను అర్చక బృందం శాస్త్రోక్తంగా జరిపారు. ప్రధాన అర్చకులు బుద్దు పవన్ కుమార్ శర్మ, వేదపండితులు కొమ్మూరి ఫణి కుమార్ శర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మ వార్ల ద్వాదశ ప్రదక్షిణలు సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విశేష అలంకరణతో ఊయలపై స్వామి, అమ్మవారను ఆశీనులను గావించి వేదమంత్రోచ్చరణ నడుమ స్వామివార్ల పుష్పశయాలంకృత పర్యంక సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగిన స్వామివారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాలు పవళింపు సేవతో ముగిశాయి. ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ, ఆలయ ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం అధిక సంఖ్యలో విచ్చేసిన భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం కావడంతో భక్తులు బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.



రాజధాని ఫైల్స్ చిత్రం రైతులతో కలిసి చూసి వస్తున్న రావెళ్ల సోదరులు

రైతులకు రావెళ్ల సోదరుల సంఘీభావం

ఫస్ట్ షో తీసుకుని ప్రదర్శించిన వైనం

చల్లపల్లి : రాజధాని ఫైల్స్ సినిమా ఒక షో పూర్తిస్థాయిలో తీసుకుని రైతులకు చూపించి తమ మద్దతును తెలియజేశారు రావెళ్ల సోదరులు. చల్లపల్లి కోమలా థియేటర్‌లో రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శన జరుగుతోంది. మంగళాపురం గ్రామానికి చెందిన రావెళ్ల కృష్ణ సేవా సమితి నిర్వాహకులు రావెళ్ల ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్ రైతుల కోసం ఫస్ట్ షో మొత్తం తీసుకున్నారు. దీంతో గ్రామం నుంచి రైతులు, మహిళలు, టీడీపీ నేతలు సినిమా చూసేందుకు వచ్చారు. సేవా సమితి అధ్యక్షుడు నిడమానూరి దిలీప్ కుమార్, మాజీ సర్పంచ్ రావెళ్ల సుజాత, టీడీపీ నేతలు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, ఫైడిపాముల కృష్ణకుమారి, రావెళ్ల విజయ్ తదితరులు ఉన్నారు. థియేటర్ స్థాపించిన 41 సంవత్సరాల కాలంలో ఇలా షో మొత్తాన్ని తీసుకున్నవారు ఎవరూ లేరని, షో తీసుకున్న రావెళ్ల బ్రదర్స్‌కు, రాజధాని ఫైల్స్ దర్శక నిర్మాతలు భాను, కంఠమనేని రవిశంకర్‌లకు థియేటర్ యజమాని కుర్రా వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.



రావిగుంటలో బాబు ష్యూరిటీ కరపత్రాలు అందజేస్తున్న కాగిత కృష్ణప్రసాద్



మర్రివాడలో పల్లెబాట కార్యక్రమంలో కుమార్ రాజా

మోసకారి జగన్ గద్దె దిగడం ఖాయం

● కాగిత కృష్ణప్రసాద్

బంటుమిల్లి, ఫిబ్రవరి 18 : అబద్ధపు, బూటకపు మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్న జగన్ గద్దె దిగే రోజు ఆసన్నమైందని పెడన నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్ ఆదివారం అన్నారు. మండలంలోని రావిగుంట పంచాయతీ పరిధిలో పార్టీ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కూటమి విజయం సాధించిన తరువాత ఇచ్చిన హామీలు తప్పక అమలు పరుస్తారన్నారు. బొర్రా కాశీ, బోస్, సింగంశెట్టి శ్రీనివాసరావు, సుధాకర్, మురళీ, సన్నాల ప్రసాదు, కట్టా జయస్వామి, ఆకునూరి రత్నం, మురాల నాగేశ్వరరావు, బొల్లా శ్రీను, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతా : కుమార్ రాజా

మంటాడ (పమిడిముక్కల) : టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు తోడ్పాటుతో పామర్రు నియోజక వర్గాన్ని అభివృద్ధి బాటలో పరుగులు పెట్టిస్తానని నియోయకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ వర్ల కుమార్ రాజా అన్నారు. పల్లెబాటలో భాగంగా ఆదివారం మంటాడలో పర్యటించి ప్రజాసమస్యలు తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో గ్రామాభివృద్ధి చేసామన్నారు. టీడీపీ, జనసేన పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కాగిత కృష్ణప్రసాద్‌కు అర్జీ ఇస్తున్న ఉద్యోగులు

పాత పెన్షన్ విధానాన్ని టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలి

బంటుమిల్లి : పాత పెన్షన్ విధానాన్ని టీడీపీ మేనిఫెస్టోలో చేర్చాలని ఉద్యోగ సంఘం నాయకులు ఆదివారం పెడన ఇన్‌చార్జ్ కాగిత కృష్ణప్రసాద్‌కు అర్జీ ఇచ్చారు. ప్రభుత్వం ప్రకటించి కొత్త పెన్షన్ విధానం కంటే పాత పెన్షన్ విధానమే అందరికి శ్రేయస్కరం అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించి పెన్షన్, గ్రాట్యుటీ కల్పించాలని కోరారు. భాస్కర ఫణి కుమార్, రామకృష్ణ, ఎస్ఎవిడి ప్రసాదు, రవికుమార్, ఎండి మున్వర్, సురేష్, విశ్వనాధం , నాగరాజు, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.



బాలుడు దినేష్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కొల్లు రవీంద్ర

బాలుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 : పార్కు గేటు పడి మృతి చెందిన బాలుడి కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని, బాలుడి మృతికి బాధ్యులైన పాలకులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర డిమాండ్ చేశారు. బ్రహ్మపురం మునిసిపల్ పార్కు గేటు పడి మృతి చెందిన వడ్డి దినేష్ కుటుంబ సభ్యులైన ఆటో డ్రైవర్ వడ్డి లక్ష్మీకాంత్, నాగలక్ష్మిలను కొల్లు రవీంద్ర ఆదివారం పరామర్శించారు. ప్రభుత్వం తక్షణం స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు. తనవంతుగా కుటుంబాన్ని ఆదుకుంటానన్నారు.

వీనులవిందుగా గాత్ర కచేరీ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 : ఉల్లింగిపాలెంలో దొంతులమ్మ అమ్మవారి 92వ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం లక్ష్మీగణపతి హోమం జరిగింది. అమ్మవారికి సహస్ర కుంకుమార్చన జరిపారు. లలితా సహస్ర నామ పారాయణ జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాలలో బెంగళూరుకు చెందిన యడవల్లి మనస్వి, జిడ్డు ప్రశాంతి గాత్ర కచేరీ ప్రేక్షకుల వీనుల విందు చేసింది. కంచా కోడూరుకు చెందిన ఆంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన అలరించింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు సైకం సోమశేఖరరావు, రంగనాయకులు పర్యవేక్షించారు.

గుల్జార్‌కు జ్ఞానపీఠ్ అవార్డు పట్ల హర్షం

నాగాయలంక : ప్రముఖ హిందీ కవి, రచయిత గుల్జార్‌కు జ్ఞానపీఠ్ అవార్డు రావటం పట్ల దివిసీమకు చెందిన నడకుదుటి రాధాకృష్ణ, జి.మాల్యాద్రి తదితరులు హర్షం వ్యక్తం చేశారు. గుల్జార్‌కి ఈ అవార్డు ఇవ్వటం ద్వారా సాహిత్యానికి వన్నె తెచ్చారని వారు పేర్కొన్నారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి



చల్లపల్లి, ఫిబ్రవరి 18 : కొత్తమాజేరుకు చెందిన తిరుమలశెట్టి శివపాములు (38) చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. ఆదివారం మధ్యాహ్నం శివపాములు గుండేరులో చేపలు పట్టేందుకు వెళ్లి ఊబిలో కూరుకుపోయి మృతి చెందాడు. స్థానికులు గమనించి వీఆర్వోకు సమాచారం అందజేశారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శివపాములు మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పంచాయతీ సర్పంచ్‌ల సమావేశం రేపు

నాగాయలంక : విజయవాడ రాఘవయ్య పార్కు ఎదురుగా ఉన్న బాలోత్సవ్ భవన్‌లో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కమిటీ సమావేశం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మండలి ఉదయభాస్కర్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముప్పనేని రవి ప్రసాద్ తెలిపారు. సభ్యులందరూ తప్పనిసరిగా హాజరుకావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

నూతన వంగడాలపై అవగాహన

మోపిదేవి : కూరగాయల సాగు చేసే రైతులకు అవనితేజ రకం మేలైన వంగడాలని కంపెనీ రీజినల్ మేనేజర్ హరి తెలిపారు. నాగాయితిప్ప శివారు పోచిగానిలంక వద్ద రైతు ప్రదర్శన క్షేత్రం నిర్వహించారు. పచ్చిమిర్చి, టమాట, బెండ వంటి అన్ని రకాల అవనితేజ రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ రకం విత్తనాల దిగుబడులు దూర ప్రాంతాలకు రవాణా చేసుకునేందుకు వీలుగా ఉంటాయని తెలిపారు. రైతులు సత్యనారాయణ, శివాజీ తదితరులు ఉన్నారు.

వెంకట్రామ్ పరామర్శ

నాగాయలంక : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకి శస్త్ర చికిత్స చేయించుకుని విజయవాడలో చికిత్స పొందుతున్న చిన్నకమ్మవారిపాలెం గ్రామానికి చెందిన కావూరి రాఘవరావును ఆదివారం టీడీపీ ఉపాధ్యక్షుడు మండలి వెంకట్రామ్ ఆదివారం పరామర్శించారు. ఆయనతోపాటు నాగాయలంక గ్రామ టీడీపీ అధ్యక్షుడు ఉప్పల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

వేకనూరులో వరికుప్ప దగ్ధం

అవనిగడ్డ రూరల్ : వేకనూరు పంచాయతీ కార్యదర్శి రాజనాల శివనాగ ఫణీంద్రకు చెందిన ఎకరం వరికుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. కొద్ది కాలంగా స్థలాన్ని దేవాలయానికి ఇవ్వాలని ఆలోచనలో శివనాగ ఫణీంద్ర ఉన్నారు. ఇటువంటి దారుణానికి పాల్పడిన వారిని శిక్షించాలణి ఫణీంద్ర కోరుతున్నారు. దేవుడికి ఇచ్చే స్థలంలో ఇటువంటి సంఘటన జరగటం దుర్మార్గమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కర్ణభక్త కల్యాణ మండపం అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పెడన : వీరభద్రపురంలోని కర్ణభక్త కల్యాణ మండపంపై పైఅంతస్తు నిర్మాణానికి ఖాసా గణపతి, అన్నపూర్ణ దంపతులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు హాజరయ్యారు. దొడ్డిపట్ల నాగేశ్వరరావు, వాసా గంగాధరరావు, వాసా సాంబశివరావు తదితరులు పర్యవేక్షించారు.

సాయికృష్ణ కుటుంబానికి రావి పరామర్శ



గుడివాడ : ఇటీవల బస్టాండ్ వద్ద రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తొమ్మిదో వార్డు వలంటీర్ హరి బ్రహ్మ సాయికృష్ణ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు పరామర్శించారు. సాయికృష్ణ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆయన సాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. షేక్ జానీఫరీష్, సయ్యద్ హన్ను, షేక్ జునైద్, సయ్యద్ జబీన్, మహ్మమద్ రఫీ. నున్న పృధ్వీతేజ, ముళ్ళపూడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ చేసినా పీహెచ్‌సీకి తాళాలే!



మోపిదేవి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అయుష్మాన్ భారత్‌లో భాగంగా 24 గంటలు పని చేసేలా పీహెచ్‌సీలను అప్‌గ్రేడ్ చేసినా ఆదివారం రావివారిపాలెం పీహెచ్‌సీని తెరవలేదు. 24 గంటలూ ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉండేలా సిబ్బందిని నియమించి డ్యూటీలు వేశారు. అయినా, ఆదివారం ఉదయం పీహెచ్‌సీ భవనానికి తాళాలు వేసి ఉండటంతో వైద్యసేవల నిమిత్తం వచ్చిన ప్రజలు వెనుదిరిగి వెళ్లాల్సి వచ్చింది. ఇటీవల పీహెచ్‌సీ రాత్రి సమయాల్లో సైతం తాళాలు వేసి ఉండటాన్ని మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకురావటం జరిగింది. తాళాలు వేసి ఉండటం పట్ల ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ప్రజలు తెలిపారు.

సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం



అవనిగడ్డ రూరల్ : వేకనూరులో సూర్యనారాయణ శాంతి కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో సైకం వెంకటేశ్వరరావు - లక్ష్మీ కుమారి దంపతులు పీటల మీద కూర్చుని కల్యాణం నిర్వహించారు. తుంగల నరసింహస్వామి - వాణి దంపతుల మనవడు అరుష్ పుట్టిన రోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో అన్నదానం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుంగల వీరవసంతరావు - ఇందిరా దేవి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఉదయపు నడకతో పాపారావు పలకరింపులు!

అవనిగడ్డ రూరల్ : జనసేన పార్టీ నాయకులు చిలకలపూడి పాపారావు సరికొత్త సంప్రదాయానికి శ్రీకారం చుట్టారు. ప్రతీ రోజూ ఉదయపు నడకలో భాగంగా అవనిగడ్డ బీసీ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. పేద ప్రజల కష్టాలు తీర్చటానికి జనసేన పార్టీ ఆవిర్భవించిందని, ప్రతి ఒక్కరూ జనసేన, టీడీపీ పొత్తును ఆహ్వానించాలన్నారు. అన్ని వర్గాలకు మేలు చేయాలన్న ఉద్దేశ్యంతో జనసేన, టీడీపీ పొత్తు ఖరారైందని అన్నారు. విద్యార్థులు, వృద్ధులు, పెద్దలను కలసి జనసేన సిద్ధాంతాలను వివరించారు. జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చినపారుపూడిలో శ్రీకృష్ణుడి విగ్రహ ప్రతిష్ఠ నేడు



పెదపారుపూడి : చినపారుపూడిలో శ్రీ కృష్ణ మందిరం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్వామివారిని గ్రామ పుర వీధుల్లో ఊరేగించారు. యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీన చినపారుపూడిలో శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ ఉదయం గం. 10.38 నిముషాలకు జరుగుతుందన్నారు. క్షీరాభిషేకం, ధాన్యాధివాసం, హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ అనంతరం శాంతి కల్యాణం జరుగుతాయన్నారు. స్వామివారి సన్నిధిలో అన్నసమారాధన ఉంటుందని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుకు కేంద్రీయ విద్యాలయం విద్యార్థి



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 18 : మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయం విద్యార్థి భట్టా రాహుల్ జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయినట్టు విద్యా సంస్థ ప్రిన్సిపాల్ మహమ్మద్ అసిఫ్ హుస్సేన్ తెలిపారు. మొక్క పెరిగే నేల తేమను బట్టి దానికి నీరు సరఫరా అయ్యేలా రాహుల్ రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు జాతీయ ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాహుల్‌ను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా



పెడన : జాతీయ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో స్థానిక ఇందిరా కాలనీలో ఆదివారం ఎయిడ్స్ నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ బారిన పడకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, చికిత్స ఎక్కడ లభిస్తుంది తదితర అంశాలపై కళాజాతా కళాకారులు వీధి నాటిక, పాటల ద్వారా అవగాహన కల్పించారు. కళాకారులు శేఖర్‌బాబు, వీరయ్య, రవితేజ, చిరంజీవి, ప్రసాద్, కుమార్ ప్రదర్శన ఇచ్చారు.



అంబేడ్కర్ అభిమాని మారయ్యకు సత్కారం

ఘంటసాల : అంబేడ్కర్ అభిమాని మారయ్య సేవలు ఆదర్శనీయమని వక్త లు కొనియాడారు. వి.రుద్రవరం గ్రామంలో మారయ్యను ఆదివారం ఘనంగా సత్కరించారు. ప్రాథమిక విద్య ను మాత్రమే అభ్యసించిన మారయ్య 300పైగా అంబేడ్కర్ జీవిత పుస్తకాలు, పూలే, ఇతర బహుజన నాయకులకు సంబంధించిన 100కుపైగా పుస్తకాలు చదివి ఇతరులకు వివరించటమే కాక గ్రామానికి రాజ్యాంగ నిర్మాత డాక్టర్.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని అందజేశారన్నారు. దాలిపర్రులోని అంబేడ్కర్ విగ్రహానికి మెట్ల నిమిత్తం రూ.30 వేలు అందజేశారని పేర్కొన్నారు. సుమమాల నాంచారయ్య అధ్యక్షత వహించగా, ఉద్యోగుల సంఘ నాయకులు పాగోలు జ్యోతిబసు, మొవ్వ సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, రుద్రవరం మాజీ సర్పంచ్ రాగోలు పెద్ద రాఘవయ్య, తూము మధు, అల్లుడు గడ్డేటి నాగు, ఏపీ సమతా చైతన్య వేదిక కన్వీనర్ దాసి సీతా రామరాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడికి ఖండన

మచిలీపట్నం టౌన్ : అనంతపురం జిల్లా రాప్తాడు వద్ద వైసీపీ నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ మూకలు దాడి చేయడం అత్యంత దుర్మార్గపు చర్య అని టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, అన్నం ఆనంద్ పేర్కొన్నారు. టీడీపీ కార్యాలయంలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. విధి నిర్వహణలో ఉన్న ఫొటోగ్రాఫర్‌పై దాడి చేయడం అత్యంత బాధాకరమన్నారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యవాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. ఇటీవల సుప్రీం కోర్టు సైతం మీడియా ప్రతినిధులు, ఫొటోగ్రాఫర్లపై దాడులు జరిపితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించిందన్నారు. వృత్తి ధర్మంలో ఉన్న జర్నలిస్టులపై దాడులు జరిపి సాధించేదేమీ లేదన్నారు. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.